సాక్షి
జనగామ
ఆదివారం | 23 | ఏప్రిల్ | 2023



ముస్తాబైన 'శ్వేతార్క' ఆలయం

కాజీపేటలోని శ్రీ శ్వేతార్క మూలగణపతి ఆలయంలో నేటి నుంచి రజతోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. - IIలో▸



జామాయిల్ తోట దగ్ధం

కురవి మండల కేంద్రానికి చెందిన చిత్తనూరి మల్లయ్యకు చెందిన ఆరు ఎకరాల జామాయిల్ తోటకు శనివారం నిప్పంటుకుని దగ్ధమైంది. - IIలో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $37^0/24^0$

ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమవుతుంది. మధ్యాహ్న ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుతాయి.

న్యూస్‌రీల్

వైభవంగా వార కల్యాణం



చిల్పూరు: శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి వార కల్యాణం శనివారం ఆలయంలో భక్తుల సమక్షాన అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు వైభవంగా నిర్వహించారు. హైదరాబాద్ చందానగర్‌కు చెందిన కొంకాల ప్రభాకర్‌రెడ్డి–శ్రీలత, రంజిత్‌కుమార్‌రెడ్డి–మాధురి దంపతులు భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఈఓ లక్ష్మీప్రసన్న, కుంచాల సంపత్ రాజు, జంగిటి కుమార్, వేల్పుల గట్టయ్య తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'రజక బంధు' ప్రకటించాలి



రఘునాథపల్లి: అన్ని రంగాల్లో వెనుకబడిన రజకుల సంక్షేమం కోసం 'రజక బంధు' పథకం ప్రకటించి ఆదుకోవాలని రజక వృత్తిదారుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎదునూరి గట్టేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించే సంఘం రాష్ట్ర మూడవ మహాసభల వాల్ పోస్టర్లను ఆయన శనివారం కుర్చపల్లి, కోమళ్ల, గోవర్ధనగిరి గ్రామాల్లో ఆవిష్కరించి మాట్లాడారు. రజకులకు ఉచిత విద్యుత్, రూ.5 లక్షల బీమా సౌకర్యం, 50 ఏళ్లు నిండిన వారికి రూ.5 వేల ఆసరా పింఛన్ ఇవ్వాలన్నారు. అనేక సమస్యలతో సతమతమవుతున్న రజకులు ఐక్యమత్యంతో ముందుకు సాగాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మైలారం వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి యామంకి శ్రీను, చంద్రయ్య, వెంకటేశ్వర్లు, ఐలయ్య, సత్యనారాయణ, రామ్మూర్తి, అబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాహితీ శిఖరం రవ్వా శ్రీహరి


రవ్వా శ్రీహరి(ఫైల్)

పాలకుర్తి టౌన్: సాహితీ శిఖరం ఆచార్య రవ్వా శ్రీహరి మరణం సాహితీలోకానికి తీరని లోటని రాజ్యసభ మాజీ సభ్యుడు రాపోలు ఆనందభాస్కర్, సాహితివేత్త డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్, సోమనాథ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ అన్నారు. సుప్రసిద్ధ సంస్కృతాంధ్ర సాహితీవేత్త, నిఘంటువు నిర్మాత రవ్వా శ్రీహరి శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని స్వగృహంలో అనారోగ్యంతో మరణించారు. ఈ సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని శనివారం పాలకుర్తిలో సాహితీ వేత్తలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ద్రవిడ విశ్వవిద్యాలయ పూర్వ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించిన ఆచార్య రవ్వ శ్రీహరి.. బసవ సంక్షేమ సమితి, తిరుమల తిరుపతి దేవస్థానం పక్షాన పాలకురికి సోమనాథుని రచనలు ప్రచురించారని తెలిపారు. సోమనాథ కళాపీఠం నుంచి 2004లో సోమనాథ సాహిత్య పురస్కారం అందుకున్నారని వివరించారు.

నెల్లుట్ల సర్పంచ్‌కు ఘన స్వాగతం



లింగాలఘణపురం: జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీ పురస్కారం అందుకున్న నెల్లుట్ల సర్పంచ్ చిట్ల స్వరూపరాణిభూపాల్‌రెడ్డికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఈనెల 17న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న ఆమె శనివారం రాత్రి గ్రామానికి చేరుకున్నారు. దుర్గమ్మ గుడి వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం డప్పు చప్పుళ్లు, మహిళల కోలాటాలు, బోనాలతో ఊరేగింపుగా వచ్చి.. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ర్యాలీ జీపీ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు యశోధలక్ష్మి, కావ్య, నర్సింహ్మ, బీఆర్‌ఎస్ నాయకులు నాగరాజు, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

వరంగల్ క్రైం: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోకుల్‌నగర్‌కు చెందిన వెల్పుల లక్ష్మణ్, వికాస్‌నగర్‌కు చెందిన కన్నబోయిన సంజయ్‌ని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.60,100 నగదు, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. తదుపరి చర్యల కోసం నిందితులను సుబేదారి పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు, ఎస్సైలు లవన్‌కుమార్, నిస్సార్‌పాషా, శరత్ పాల్గొన్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ తెలిపారు.

కన్నీళ్లే మిగిలాయి

ఈదురు గాలులు.. వడగళ్లతో భారీ వర్షం

- వేలాది ఎకరాల్లో వరి.. వందలాది ఎకరాల్లో మామిడికి నష్టం
- కొనుగోలు కేంద్రాల్లో కొట్టుకుపోయిన ధాన్యపు గింజలు
- లబోదిబోమంటున్న అన్నదాతలు
- జిల్లాలో 9.3 మి.మీ నగటు వర్షపాతం నమోదు


జనగామ వ్యవసాయ మార్కెట్‌లో..

జనగామ: యాసంగి వరి సాగు చేసిన రైతులపై వరణుడు పగబట్టాడు. గింజ పొట్ట దశనుంచి అడపదడపా వడగళ్లు, వర్షాలు కురిపిస్తూ.. కోతదశకు వచ్చే సరికి చేతికి అందకుండా చేశాడు. జిల్లాలో శనివారం రాత్రి వంద కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులతో పాటు వడగళ్ల వర్షం అన్నదాతలను ఆగం చేసింది. వరి, మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా.. మొక్కజొన్న, కూరగాయల పంటలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దగా మారింది. జనగామ వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులకు విక్రయించడానికి రైతులు తెచ్చిన ధాన్యం బస్తాలు వర్షపు నీటితో తడిసి పోయాయి. జనగామ, బచ్చన్నపేట, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాల్లో భారీ వడగళ్లు, దేవరుప్పుల, లింగాలఘణపురం, నర్మెట తదితర మండలాల పరిధిలో వర్షం ప్రభావం తీవ్రంగా ఉంది.

కలెక్టర్లతో మాట్లాడిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ, చేర్యాల తదితర ప్రాంతాల్లో వడగళ్ల వానతో జరిగిన నష్టంపై ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆయా జిల్లాల కలెక్టర్‌లతో పాటు మంత్రులతో ఫోన్‌లో మాట్లాడారు. గ్రామాల వారీగా వరి, మామిడి ఇతర పంటల నష్టాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే సర్వే చేపట్టి ప్రభుత్వానికి నివేదించేలా చూడాలన్నారు. ఆందోళన చెందవద్దని రైతులకు సూచించారు.

9.3 మి.మీ వర్షపాతం

జిల్లాలో శనివారం సగటున 9.3 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు సీపీఓ ఇస్మాయిల్ తెలిపారు. అత్యధికంగా జనగామ మండలంలో 35.3, అత్యల్పంగా లింగాలఘణపురంలో 1.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు.

జనగామలో వడగళ్ల వర్షం వివరాలు(మి.మీ)

మండలం	వర్షపాతం
జనగామ	35.3
బచ్చన్నపేట	30.0
రఘునాథపల్లి	17.0
దేవరుప్పుల	13.0
నర్మెట	10.3
పాలకుర్తి	9.3
తరిగొప్పుల	7.5
చిల్పూరు	3.8
జఫర్‌గఢ్	3.0
లింగాలఘణపురం	2.5
స్టేషన్‌ఘన్‌పూర్	1.3


బచ్చన్నపేట మండలం నాగిరెడ్డిపల్లిలో భారీ వడగళ్లు


రాలిన ధాన్యపు గింజలను చూపుతున్న రైతు నరేందర్‌రెడ్డి

- మరిన్ని వివరాలు IIIలో▸

నష్ట పరిహారం వెంటనే చెల్లించాలి : పొన్నాల లక్ష్మయ్య, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు

జిల్లాలో వడగళ్ల వానకు నష్టపోయిన ప్రతి రైతుకు వెంటనే పరిహారం చెల్లించాలని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. అకాల వర్షంపై స్పందించిన ఆయన జనగామ, బచ్చన్నపేట తదితర మండలాల పరిధిలో బాధిత రైతులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

100 శాతం నష్టం జరిగింది : బేజాడి బీరప్ప, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు

బచ్చన్నపేట, జనగామతో పాటు పలు మండలాల్లో వడగళ్ల వానతో వరి పంటకు 100 శాతం నష్టం జరిగిందని, ఇంతకు ముందు ఇలాంటిది చూడలేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. బచ్చన్నపేట మండలంలో నష్టపోయిన ప్రతిరైతుకు ఎకరాకు రూ.20వేలు తక్షణ సాయంగా పరిహారం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా రైతులను ఆదుకోవాలని కోరారు.


జనగామ పీఏసీఎస్‌లో..


జనగామ వ్యవసాయ మార్కెట్‌లో..


బచ్చన్నపేటలో రాలిన మామిడి కాయలు

పండుగలు నిర్వహించే సంస్కృతి..

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


పాలకుర్తిలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

పాలకుర్తి/కొడకండ్ల: ప్రజల పండుగలను ప్రభుత్వమే ఘనంగా నిర్వహించే సంస్కృతి తెలంగాణలో నిలిచి పోయిందని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా శనివారం పాలకుర్తి, కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామంలో జరిగిన వేడుకలకు హాజరైన ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, 2008 నుంచి 2014 వరకు రూ.812 కోట్లు ఖర్చు చేయగా.. గడిచిన ఎనిమిదేళ్ల కాలంలో వేల కోట్లు వ్యయం చేసిందని చెప్పారు. మైనార్టీల పిల్లల కోసం ఏర్పాటు చేసిన గురుకులాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కొడకండ్ల మండలకేంద్రంలో జరిగిన రంజాన్ వేడుకల్లో మంత్రి దయాకర్‌రావు సతీమణి ఉషాదయాకర్‌రావు పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీలు నాగిరెడ్డి, జ్యోతి, జెడ్పీటీసీలు పుస్కూరి శ్రీనివాస్‌రావు, సత్తమ్మ, మార్కెట్ చైర్మన్ రాము, ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.మదార్, ఎంపీటీసీలు మధుసూదన్, విజయలక్ష్మి, అమరేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు నవీన్, సిందె రామోజీ, పాలకుర్తి సర్పంచ్ యాకాంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ–శ్రమ్ పోర్టల్‌పై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య

జనగామ రూరల్: అసంఘటిత రంగ కార్మికులకు ఈ–శ్రమ్ పోర్టల్‌పై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అనుబంధ శాఖల అధికారులకు సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సామాజిక భద్రత, సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ప్రత్యేక గుర్తింపు కార్డు ద్వారా ప్రతి కార్మికుడికి ఏడాది పాటు ప్రధానమంత్రి సురక్షణ బీమా యోజన కింద రెండు లక్షల ప్రమాద(మరణ), అంగవైకల్యం బీమా ఉచితంగా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అసంఘటితరంగ కార్మికులకు అమలు చేసే పథకాలకు ఈ పోర్టల్‌లోని వివరాలను ప్రామాణికంగా తీసుకుంటుందని, వలస కార్మికులు ఎక్కడ ఉన్నారో గుర్తించి ఉపాధి కల్పిస్తారని చెప్పారు. 16 నుంచి 59 సంవత్సరాల లోపు వయసువారు, ఆదాయ పన్ను పరిధిలోనికి రానివారు, అన్ని వర్గాల కార్మికులకు పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ కేవైసీ కలిగిన ఆధార్ కార్డుకు అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో ఆన్‌లైన్, గ్రామపంచాయతీ కార్యాలయాలు, కామన్ సర్వీస్ సెంటర్లలో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జనగామలోని కార్మిక శాఖ, కార్యాలయం 9182073288, 9949196247 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పంటలు ఎండిపోతున్నా పట్టని ఎమ్మెల్యే

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న దశమంతరెడ్డి

జనగామ: యాసంగి సీజన్‌లో భూగర్భ జలాలు అడుగంటి పోయి పంటలు ఎండిపోతుంటే కనీసం పట్టించుకోని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి.. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే నైతిక హక్కు లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వరి పొట్ట దశలో భూగర్భజలాలు అడుగంటి బోరుబావులు వట్టిపోయిన సమయంలో గోదావరి జలాలను తరలించడంలో నిర్లక్ష్యం చేయడమే కాకుండా.. గోస చెప్పుకునేందుకు వెళ్లిన రైతుల పట్ల దురుసుగా ప్రవర్తించి అవమానించిన ఎమ్మెల్యే.. తాను రైతులకు మేలు చేస్తున్నానని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఐకేపీ సెంటర్ల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం హమాలీ డబ్బులు పంపిస్తే ఇప్పటి వరకు ఇవ్వలేదని, దమ్ముంటే ఆ డబ్బులు వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లర్లు, అధికారులు కుమ్మక్కై రైతులను దోచుకుంటున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు పార్టీలో చేరగా స్వాగతించారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు సౌడ రమేష్, శివరాజ్ యాదవ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మహిపాల్, నాయకులు కార్తీక్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత కళ్లలో ఆనందం

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి


తరిగొప్పుల: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జనగామ రూరల్/ నర్మెట/తరిగొప్పుల: సీఎం కేసీఆర్ పాలనలో గోదావరి జలాలతో రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు నిండి దండిగా పంటలు పండి రైతుల కళ్లలో ఆనందం చూస్తున్నామని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. జనగామ మండల పరిధి వెంకిర్యాల, అడవికేశ్వాపూర్, గానుగుపహాడ్, నర్మెట మండల పరిధి మచ్చుపహాడ్, మల్కపేట, తరిగొప్పుల మండల పరిధి అబ్దుల్ నాగారం, బొంతగట్టునాగారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శనివారం ప్రారంభించి మాట్లాడారు. ఏడు దశాబ్దాలు అభివృద్ధిలో వెనకబడ్డ తెలంగాణ టీఆర్‌ఎస్ పాలనలో అన్నిరంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక బీజేపీ సర్కారు అడుగడుగునా అడ్డుపడుతోందని.. చిత్తశుద్ధి ఉంటే ఎంపీలు రేవంత్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ కేంద్రం నుంచి రావాల్సిన నిధులను తీసుకురావాలని డిమాండ్ చేశారు. ధాన్యం దళారులకు విక్రయించి నష్టపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు నాణ్యతా ప్రమాణాల ప్రకారం ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ చిర్ర శ్రీనివాస్‌రెడ్డి, ఏఈఓలు భవాని, వరలక్ష్మి, ఏపీఎం నాగేశ్వర్‌రావు, ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, సర్పంచ్‌లు జయరాం, శానబోయిన శ్రీనివాస్, రామిని శివరాజ్, బానోత్ రజితా రవి, అర్జుల రమాసంపత్‌రెడ్డి, ఇరుమల్ల బాలమణి రాజయ్య, ఎంపీటీసీలు బాలస్వామి, తుపాకుల మంగ, భూక్య జుంలాల్‌నాయక్, అర్జుల మధుసూదన్‌రెడ్డి, పార్టీ నాయకులు చింతకింది సురేష్, పెద్ది రాజిరెడ్డి, పింగిళి జగన్మోహన్‌రెడ్డి, చిలువేరు లింగం, కుర్రె మల్లయ్య, బూరెడ్డి ప్రమోద్‌రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతో వాగ్వాదం


ఎమ్మెల్యేతో వాగ్వాదం చేస్తున్న రైతులు

జనగామ మండలం గానుగుపహాడ్‌లో జరిగిన కార్యక్రమంలో బొమ్మకూరు రిజర్వాయర్‌లో నీరు లేక పంటలు ఎండిపోయాయని రైతులు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి దృష్టికి తెచ్చారు. గోదావరి నుంచి వచ్చే పైపులైన్ మూడు ప్రాంతాల్లో పగిలిపోవడంతో కాలువ ప్రాంతాల్లో పంటలు నష్టపోతామని రైతులు అభ్యంతరం తెలపడంతో రూ.రెండు కోట్లతో మరమతు చేపట్టడంతో ఇన్ని రోజులు పట్టిందని చెప్పిన ఎమ్మెల్యే.. కాంగ్రెస్, బీజేపీ నాయకులు నిధులు ఇవ్వకుండా కాలువ పనులు అడ్డుకుని రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న చవటలు.. దద్దమ్మలు.. సన్యాసులు అని అన్నారు. దీంతో వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ నాయకులు.. మీరు ఎమ్మెల్యేగా ఉండి సకాలంలో నీరు ఎందుకు అందించలేదని ప్రశ్నించారు. సర్దిచెప్పే ప్రయత్నం చేయగా వినకపోవడంతో ఎమ్మెల్యే వెళ్లిపోయారు.

29న 'చలో లేబర్ కమిషనర్'

జనగామ రూరల్ : హమాలీ కార్మికులకు భవన నిర్మాణ కార్మికుల మాదిరిగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న హైదరాబాద్‌లో తలపెట్టిన 'చలో లేబర్ కమిషనర్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రాపర్తి రాజు పిలుపు నిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. హమాలీలకు 50 కేజీలకు మించిన బరువును నిషేధించాలని, పని గంటలు, పని భద్రత, గుర్తింపు కార్డులు, కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ తదితర సౌకర్యాలు, హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొట్ల శ్రీనివాస్, కోశాధికారి సుంచు విజేందర్, తెలంగాణ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు అపరాదపు రాజు, నాయకులు బైరగోని బాలరాజు గౌడ్,,రాజు, రాజారాం, శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదవ తరగతిలో ప్రవేశానికి ఆదివారం గురుకుల పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ సెంటర్‌కు 360 మంది విద్యార్థులను కేటాయించామని, ఉదయం 11 నుంచి ఒంటిగంట వరకు పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ జి.కాళహస్తి ఒక ప్రకటనలో తెలిపారు.

రైతు పథకాలకు ఐరాస గుర్తింపు

- ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

లింగాలఘణపురం: సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమానికి అమలు చేస్తున్న రైతు బీమా, ఉచిత విద్యుత్, పెట్టుబడి సాయం పథకాలను ఐక్యరాజ్య సమితి గుర్తించిందని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. శనివారం మండల పరిధి నెల్లుట్ల, లింగాలఘణపురం, వనపర్తి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. యాసంగి ధాన్యం పండించిన రైతులు ఇబ్బంది పడకుండా ముందుగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, నాణ్యమైన, తేమ లేకుండా ధాన్యం తీసుకొచ్చి గిట్టుబాటు ధర పొందాలని కోరారు. మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్ యార్డులో సీసీ వేయడానికి రూ.3.40 కోట్లు మంజూరయ్యాయని, టెండర్ పిలిచి పనులు చేపడుతారని చెప్పారు. ఎంపీపీ జయశ్రీ, జెడ్పీటీసీ వంశీధర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

సందేశం ఇస్తున్న మత గురువు


జనగామ ఈద్గాలో ప్రత్యేక ప్రార్థన చేస్తున్న ముస్లింలు


ఈద్ ముబారక్

- భక్తి శ్రద్ధలతో రంజాన్
- ఈద్గా, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- భారీగా తరలివచ్చిన ముస్లింలు


ఈద్గాలో ప్రార్థన చేస్తున్న చిన్నారులు

జనగామ: జిల్లా వ్యాప్తంగా శనివారం రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెలరోజుల పాటు కఠోర నిష్టతో ఉపవాస దీక్షలు చేసిన వారంతా మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మతగురువులు ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ చదివించి దువా చేయించారు. అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. తర్వాత పెద్దల సమాధుల వద్దకు వెళ్లి పూలు సమర్పించి వారి ఆత్మశాంతి కోరుతూ ప్రార్థనలు చేశారు. ఇళ్లకు చేరిన తర్వాత పేద కుటుంబాలకు దాన ధర్మాలు చేశారు. మతసామరస్యాన్ని చాటుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ఈద్గాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలో జరిగిన కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, కౌన్సిలర్ ఎండీ.సమ్మద్, టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు ఖాజాషరీఫ్, నారోజు రామేశ్వరాచారి, ధర్మపురి శ్రీనివాస్, చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు డాక్టర్ సుల్తాన్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

- మరిన్ని చిత్రాలు IIIలో▸


స్వీటు పంపిణీ చేస్తున్న ఏసీపీ, మున్సిపల్ చైర్‌పర్సన్, చాంబర్ అధ్యక్షుడు


ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏసీపీ, సీఐ, ఎస్‌ఐలు, నాయకులు

క్లుప్తంగా

నిప్పురవ్వలు పడి జామాయిల్ తోట దగ్ధం


కాలిపోతున్న జామాయిల్ తోట

కురవి : మండల కేంద్రానికి చెందిన చిత్తనూరి మల్లయ్యకు చెందిన ఆరు ఎకరాల జామాయిల్ తోట శనివారం అగ్నికి ఆహుతైంది. కురవి–తిర్మలాపురం గ్రామాల శివారులో ఉన్న జామాయిల్ తోటకు నిప్పంటుకుని మొత్తం దగ్ధమైంది. మధ్యాహ్నం సమయంలో నిప్పురవ్వలు ఎలా పడ్డాయో తెలియదు .. తోట కింది భాగంలో ఎండిపోయిన గడ్డికి నిప్పంటుకోవడంతో కాలిపోవడం ప్రారంభమైంది. రైతు అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందజేశారు. కురవి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని తెలుసుకున్నారు. జామాయిల్ తోట దగ్ధం కావడంతో సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

ఖిలా వరంగల్ : ఆస్తి విషయంలో మాట్లాడుకుందామని అన్న తన సొంత తమ్ముడిని ఇంటికి పిలిచి హత్యచేసిన కేసును పోలీసులు చేధించారు. హత్య చేసిన కేసులో నిందితులైన గోవిందుల శ్రీధర్, అతని భార్య అనిత, వదిన రాజమ్మలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. ఇంటిస్థలం విషయంలో అన్నదమ్ముల మధ్య జరిగిన సంఘటనలో తమ్ముడిని అన్న హత్య చేసిన విషయం పాఠకులకు విదితమే. శనివారం ఉదయం కరీమాబాద్ ఇంటి వద్ద నిందితులు ఉన్నారన్న పక్కా సమాచారంతో ఎస్సై సాంబయ్య, సిబ్బందితో కలిసి ఇన్‌స్పెక్టర్ చేరుకుని ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది.

ముస్తాబైన 'శ్వేతార్క' ఆలయం

- నేటి నుంచి 27 వరకు రజతోత్సవ వేడుకలు
- రాష్ట్ర నలుమూలల నుంచి భక్తుల రాక

కాజీపేట: స్వయంభుగా ప్రకాశితమై వేలాది మంది భక్తుల కోరికలను క్షిప్రసాదిగా నెరవేరుస్తూ భక్తులకు కొంగుబంగారమై ఇంటి ఇలవేల్పుగా భాసిల్లుతున్న శ్రీశ్వేతార్క మూలగణపతి కాజీపేటలో ఆవిర్భవించి ఆదివారంతో 25 ఏళ్లు నిండనున్నాయి. ఎంతో మంది విశిష్టాది మహాపురుషుల దర్శనంతో నిర్విఘ్న పూజాలందుకుంటున్న శ్వేతార్కుడిని చూసి తరించడానికి రాష్ట్రం నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. శ్వేతార్క దర్శనంతో కోరిన కోర్కెలు నెరవేరతుండడంతో పాటు పట్టిందల్లా బంగారం అవుతుందని భక్తుల నమ్మకం. దాతలు ముందుకు వచ్చి రూ.4 కోట్లకు పైగా ఆర్థికసాయం చేయడంతో ఒకే ప్రాంగణంలో శ్వేతార్కుడితో పాటు శైవ, వైష్ణవ సంప్రాదాయ పద్ధతుల్లో నిర్మితమైన ఆలయాల్లో 29 దేవతామూర్తులు కొలువుదీరి నిత్యం విశేష పూజలు అందుకుంటున్నారు. ఇట్టి చారిత్రక నేపథ్యం కలిగిన ఈ ఆలయంలో ఘనంగా రజతోత్సవ వేడుకలు ఘనంగా జరుగనున్నాయి.

ఒట్టిపడుతున్న శిల్ప కళ...

ఒరిస్సా, తమిళనాడు రాష్టాలకు చెందిన శిల్పుల చేతిలో శ్వేతార్క ఆలయం రూపురేఖలను మాటల్లో వర్ణించడం సాధ్యం కాదు. అడుగడుగునా శిల్పుల ప్రతిభాపాటవాలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తాయి. ఆలయ శిఖరంపైకి చేరుకుని గుడివెనుక భాగం వైపు చూస్తే గణపతి దేవుడి వాహనమైన ఎలుకను పోలిన కొండ కనిపిస్తోందని భక్తులు చెబుతున్నారు.


సంతాన లింగేశ్వరస్వామి


భక్తులను ఆకట్టుకునే శ్వేతార్కాలయ గోపురం


పరివారసమేత సత్యనారాయణస్వామి


శ్రీసీతారామలక్ష్మాంజనేయులు

అన్నపూర్ణ కేంద్రం...

ప్రముఖ ఆలయాలకు దీటుగా శ్వేతార్క ఆలయంలో నిత్యం మహాన్నదానం నిర్వహిస్తారు. ఆలయ ఆవరణలో ఉన్న అన్నపూర్ణ కేంద్రంలో స్థానిక, స్థానికేతర భక్తులకు రెండుపూటల అన్నదానం కొనసాగుతుంది. వలంటీర్లు అన్నదానంలో చురుగ్గా భాగస్వామ్యం పంచుకుని సేవలు అందిస్తూ దైవానికి సేవ చేసినట్లుగా భావిస్తుంటారు.

29 దేవతామూర్తులు కొలువుదీరారు...

ఆలయంలో 29 దేవతమూర్తులతో పాటు వేర్వేరుగా నవగ్రహాలు కొలువై ఉన్న దేవాలయం ఇది. ఇందులో మిగితా దేవతామూర్తులకు ఉన్నట్లుగానే నవగ్రహాలకు వేర్వేరుగా ఆలయాలు ఉండటం విశేషం. దేవతామూర్తులను పరిశీలిస్తే..ఆదిమూల గణపతి, యోగాంజనేయస్వామి, సంతనాలింగేశ్వరస్వామి, మహాలక్ష్మి., సరస్వతి, సంతోషిమాత, అన్నపూర్ణదేవి, సాయిబాబా, శిరిడి గణనాథుడు, అయ్యప్ప, శ్రీవేంకటేశ్వరుడు, శ్రీసీతారామలక్ష్మణాంజనేయులు, రుక్మిణీ సమేత కృష్ణుడు, శ్రీసత్యనారాయణస్వామి, శ్రీహయగ్రీవ, వల్లిదేవసేనాసహిత సుబ్రహ్మణేశ్వర, దత్తాత్రేయ, గాయత్రి, లక్ష్మీనర్సింహస్వామి, ప్రత్యేకంగా వేర్వేరుగా ఆలయాలు ఉన్నాయి.

మానసిక ప్రశాంతతకు నిలయాలు...



నిత్య పూజలతో శ్వేతార్క మూల గణపతి దేవాలయం కళకళలాడుతోంది. ఆలయానికి వచ్చే భక్తులకు మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది. స్వామి వారి పుట్టినరోజు వేడుకలను విజయవంతం చేయడానికి తగిన ఏర్పాట్లు చేయడంలో కార్యకర్తలు నిమగ్నమయ్యారు.

ఐనవోలు అనంత మల్లయ్య శర్మ సిద్ధాంతి
(దేవాలయ వ్యవస్థాపకుడు)

వ్యక్తి ఆత్మహత్య


సాయిలు మృతదేహం

వరంగల్ (పర్వతగిరి): ఒంటరితనంతో బాధపడుతూ ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం జరిగింది. పర్వతగిరి ఎస్సై దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని వడ్లకొండకు చెందిన నాళం సాయిలు(51) శనివారం కొంపల్లి దేవేందర్‌రావు మామి డితోటలో చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు భార్యలు. ఇద్దరికి చెరో కుమారుడు ఉండగా భార్యలు గతంలోనే మృతి చెందారు. కుమారులు వారి వారి అమ్మమ్మ ఇళ్లలో ఉంటున్నారు. దీంతో సాయిలు ఒంటరిగా గ్రామంలో తల్లితో కలిసి జీవిస్తున్నాడు. తనను చూసుకునే వారు లేక ఒంటరి తనంలో బాధపడుతూ చెట్టుకు ఉరేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి కౌసల్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న బొలెరో

- ఇద్దరికి గాయాలు

పెద్దవంగర: బొలేరో వాహనం బైక్‌ను ఢీ కొనడంతో ఇద్దరి గాయాలైన సంఘటన మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన అనపురం అజయ్, ఎదునూరి లక్ష్మణ్ ఇద్దరు పనుల నిమిత్తం తొర్రూరుకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో హైదరాబాద్‌కు చెందిన సురేష్ తిర్మలగిరి మీదుగా బొలేరో వాహనాన్ని ఫ్రిడ్జిల లోడుతో తొర్రూరులో దిగుమతి చేసేందుకు వెళ్తున్న క్రమంలో చిన్నవంగర శివారులోని ఆ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఇద్దరికీ గాయాయి. అజయ్ కుటుంబ సభ్యుడు కృష్ణ ఫిర్యాదు మేరకు సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాయంగా వెళ్లి యువకుడి మృత్యువాత

- పిడుగుపాటుకు ఒకరు మృతి
- మరో ఇద్దరికి స్వల్పగాయాలు
- ఒకే చోట తలదాచుకున్న నలుగురు
- అనుమానం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

మరిపెడ రూరల్: వర్షం నుంచి ఆరబోసిన పంటను కాపాడడానికి స్నేహితుడికి సాయంగా వెళ్లిన ఓ యువకుడు పిడుగుపడి మృత్యువాత పడ్డాడు. నలుగురు స్నేహితులు ఒకే చోట తలదాచుకున్నప్పటికీ ఓ యువకుడు మాత్రమే మృతి చెందడంపై బాధిత కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వెంకంపాడు చెరువు కట్టపై శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని బావోజీగూడెంకు చెందిన బీమనపల్లి ఈశ్వర్ (చింటు) వరి ధాన్యం వ్యాపారం చేస్తుంటాడు. గ్రామంలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేసుకొని అక్కడే చెరువు కట్టపై ఆరబోశాడు. శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభం కాగా, తన స్నేహితులైన ఊగుడుల శ్రీనివాస్ (22), దిగజర్ల నాగరాజు, దిగజర్ల రవిని తనకు సాయంగా తీసుకొని ధాన్యం వద్దకు తీసుకెళ్లాడు. ధాన్యం రాసులపై పట్టాలు కప్పి వర్షం వస్తుండగా అక్కడే ఉన్న ట్రాక్టర్ ట్రాలీ కింద తలదాచుకున్నారు. వీరి తలదాచుకున్న చోట ఒక్కసారిగా పిడుగుపడడంతో నలుగురు స్పృహతప్పి పడిపోయారు. వర్షం వెలిసిన తర్వాత ఈశ్వర్, నాగరాజు, రవిలకు మెలకువ వచ్చి లేచారు. శ్రీనివాస్‌ను తోటి మిత్రులు లేపే ప్రయత్నం చేయగా ఎంతకూ లేవకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి శ్రీనివాస్ మృతి చెందినట్లు తెలిపారు.


శ్రీనివాస్ (ఫైల్)

శ్రీనివాస్ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

ఈదురు గాలులతో కురుస్తున్న వర్షానికి నలుగురు స్నేహితులు ట్రాక్టర్ ట్రాలీ కింద తలదాచుకున్నారు. పిడుగుపడితే నలుగురు చనిపోయే పరిస్థితి ఉండగా మా వాడు మాత్రమే ఎలా చనిపోయాడని మృతుడి కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్ తెలిపాడు.

బోగస్ నంబర్లతో వల

- నమ్మి మోసపోతున్న వినియోగదారులు

కాజీపేట: నిత్యం ఏదో ఒక సందర్భంలో ఏదో ఒక సమస్యను ఎదుర్కొంటాం. వాటికి సంబంధించిన సమాచార అన్వేషణ కోసం ఇంటర్‌నెట్‌పై ఎక్కువగా ఆధారపడుతున్నాం. ఇంటర్‌నెట్‌లోని వివిధ వెబ్‌సైట్‌లను పరిశీలించే వారి సంఖ్య పెరుగుతోంది. మనిషి అవసరాన్ని గుర్తించిన కేటుగాళ్లు తమ సంపాదనకు మలుచుకుంటున్నారు. ఫలితంగా సొమ్ము పరుల పాలవుతోంది. సేవా లోపాల పరిష్కారానికి వివిధ సంస్థల ఫోన్ నంబర్లు ఇంటర్‌నెట్‌లో బోగస్‌వి పెడుతున్నారు. వాటికి పలువురు వినియోగదారులు ఫోన్‌చేసి మోసగాళ్ల ఉచ్చులో పడి బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును పోగొట్టుకుంటున్నారు.

కొరియర్ నంబర్ కోసం వెతికితే...

కాజీపేటకు చెందిన అబ్దుల్ ఖాదర్ హైదరాబాద్‌లో ఉండే తన స్నేహితుడికి ఇటీవల ఓ పార్సిల్‌ను కొరియర్ చేశాడు. వారం గడుస్తున్నా కొరియర్ రాకపోయేసరికి ఇంటర్‌నెట్‌లో సంబంధిత సంస్థ కస్టమర్ కేర్ నంబర్ కోసం వెతికి దానికి ఫోన్ చేశాడు. ఆ నంబర్ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. తర్వాత కొద్దిసేపటికి కొరియర్ సంస్థ నుంచి అంటూ ఓ వ్యక్తి ఫోన్ చేసి పరిచయం చేసుకున్నాడు. మీ పార్సిల్ బ్రాంచి కార్యాలయంలో ఆగిందని, ప్రాసెస్ చేయడానికి రూ.2 ఫోన్ ద్వారా చెల్లించాలని కోరారు. మీకు రాము అనే కొరియర్ బాయ్ తీసుకొస్తాడని చెప్పి ఓ నంబర్ ఇచ్చాడు. ఆ నంబర్‌కు రూ.2 చెల్లిస్తే ఈ నెల 26 వరకు పార్సిల్ చేరుస్తామంటూ ఓ లింక్ పంపించాడు. నిజమే అని నమ్మిన అబ్దుల్ ఖాదర్ ఆ లింక్‌ను క్లిక్‌చేసి డబ్బు చెల్లించాడు. రెండు రోజులు దాటుతున్నా కొరియర్ సర్వీస్ అడ్రస్ లేకపోవడంతో పాటు సెల్‌ఫోన్‌కు వచ్చిన ఎస్ఎంఎస్‌లు చూసి అవాక్కయ్యాడు. తొమ్మిది విడుతలుగా రూ.1.36 లక్షలు ఆయన బ్యాంక్ ఖాతా నుంచి డ్రా అయ్యాయి. వెంటనే ఖాతాను బ్లాక్ చేయించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇలాంటి ఆన్‌లైన్ కేసులు ఒక కాజీపేట పీఎస్‌లోనే పాతికకు పైగా నమోదయ్యాయి. ఇంటర్‌నెట్‌లోని వివిధ వెబ్‌సైట్లలో పలువురు మోసగాళ్లు ..వివిధ కంపెనీల, బ్యాంకుల కస్టమర్ కేర్ నంబర్ అని చెప్పి తమ సొంత ఫోన్ నంబర్లను ఉంచుతున్నారు. వెబ్‌సైట్లలో వెతికి ఈ నంబర్లను ఉంచుతున్నారు. వెబ్‌సైట్లలో వెతికి ఈ నంబర్లకు ఫోన్ చేసి మోసపోకూడదు. ఆ సంస్థకు చెందిన అధీకృత వెబ్‌సైట్ నుంచి మాత్రమే తీసుకోవాలి. ప్రైవేట్ వెబ్‌సైట్లలో వివరాలు నమోదు చేయకూడదు. అవి మోసగాళ్లకు సులువుగా వెళ్తాయి. సంబంధిత కంపెనీ వెబ్‌సైట్‌లోకి వెళ్లడం ఉత్తమం.

సాక్షి క్లాసిఫైడ్స్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని మహబూబాబాద్, వరంగల్ జిల్లాలో వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో శనివారం ఇద్దరు మృతి చెందారు.


లచ్చు (ఫైల్)

నర్సింహులపేట: మండలంలోని పెద్దనాగారం పరిధి గోపతండా సమీపంలో వరంగల్–ఖమ్మం హైవేపై శుక్రవారం అర్ధరాత్రి డీసీఎంను ద్విచక్రవాహనదారుడు ఢీకొన్న ఘటనలో వాంకుడోత్ తండాకు చెందిన వాంకుడోత్ లచ్చు(45) మృతి చెందాడు. ఎస్సై మంగీలాల్ కథనం ప్రకారం..మరిపెడకు పనుల నిమిత్తం వెళ్లిన లచ్చు తిరిగి బైక్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో గోపతండా సమీపంలో ఆగి ఉన్న డీసీఎంను ఢీకొన్నాడు. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


అచ్చి (ఫైల్)

నర్సంపేట రూరల్ : హీరోహోండా స్కూటీని, ట్రాలీ ఆటో ఢీకొనడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పట్టణ శివారులోని కాకతీయనగర్ సమీపంలో శనివారం చోటు చేసుకుందని ఎస్సై రవీందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం .. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం ఏపూర్‌కు చెందిన వాంకుడోతు అచ్చి(42) తన కుమారుడు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆస్పత్రిలో చూపించేందుకు నర్సంపేటకు తీసుకొచ్చారు. అయితే డబ్బులు సరిపోకపోవడంతో వారి బంధువుల ఇళ్లయిన చెన్నారావుపేట మండలం వైపు స్కూటీపై వెళ్తోంది. అదే సమయంలో చెన్నారావుపేట మండలానికి చెందిన ట్రాలీ ఆటో నర్సంపేటవైపు వస్తుంది. నర్సంపేట పట్టణంలోని కాకతీయనగర్ సమీపంలోని బిలివర్స్ చర్చి వద్ద నర్సంపేట –నెక్కొండ ప్రధాన రహదారిపై రెండు వాహనాలు ఢీకొనడంతో స్కూటీపై ఉన్న అచ్చి అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై ఘటన స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టంకు తరలించారు. మృతురాలికి భార్య, కుమారుడు ఉన్నారు.


సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

- తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రామ శ్రీనివాస్


మాట్లాడుతున్న రామ శ్రీనివాస్

శాయంపేట : తెలంగాణ రాష్ట్రంలోని పద్మశాలి కులస్తుల సమస్యల సాధనకు అందరు ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, సమన్వయ కమిటి చైర్మన్ రామ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని చేనేత సొసైటీలో పద్మశాలి గ్రామ కమిటీ ఎన్నికకు శుక్రవారం రాత్రి మండల అడహాక్ కమిటీ కన్వీనర్ వావిలాల వేణుగోపాల ప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పద్మశాలీలు పటిష్టత కోసం గ్రామ మండల, జిల్లా స్థాయి కమిటీలను వేస్తున్నట్లు తెలిపారు. సభ్యులందరి ఆమోదంతో ఏకగ్రీవ కమిటీలు చేయాలని సూచించారు. రాష్ట్ర పద్మశాలి సంఘం శాశ్వత, చందా సభ్యత్వాలను చేర్పిస్తున్నామని 18 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరూ సభ్యత్వం ద్వారా వచ్చిన నిధులను హైదరాబాద్ బ్యాంకులో జమ చేసి 50 శాతం నిధులను తిరిగి జిల్లాలో అనాథ కుటుంబాలను ఆదుకోవడానికి వినియోగిస్తామని తెలిపారు. అనంతరం శాయంపేట సర్పంచ్ కందగట్ల రవి, సొసైటీ మాజీ చైర్మన్ దిడ్డి రమేష్, మండల జర్నలిస్టులు బాల్నె తిలక్‌బాబు, మంత్రి వెంకటేశ్వర్లు, మంత్రి రమేష్‌బాబు చేనేత వస్త్రాలతో రామ శ్రీనివాస్‌ను సత్కరించారు. గ్రామ కమిటీ అధ్యక్ష ఎన్నికకు ఐదుగురు అభ్యర్థుల బరిలో ఉండడంతో ఎన్నికలు వాయిదా వేశారు. అతి త్వరలోనే కమిటీని ఎన్నుకుంటామని ప్రకటించారు. కార్యక్రమంలో హనుమకొండ, జనగాం, మెదక్ జిల్లాల అధ్యక్షులు డాక్టర్ చందా మల్లయ్య, వేముల బాలరాజు, గుడ్ల వీరభద్రయ్య, రాష్ట్ర కో కన్వీనర్ బూర మల్లేశం, హైదరాబాద్ పట్టణ ఉపాధ్యక్షులు వనం సుమన్, మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాశ్, మండల అడహాక్ కమిటీ కో–కన్వీనర్ కందగట్ల ప్రకాశ్, సభ్యులు మధుసూదన్, లక్ష్మీనారాయణ, జలంధర్ పాల్గొన్నారు.

రైతులపై ప్రకృతి కన్నెర్ర


జనగామ మండలం ఓబుల్‌కేశ్వాపూర్‌లో వరిపొలంలో కురిసిన వడగండ్లు


కురవిలో నేలరాలిన మామిడికాయలను ఏరుతున్న రైతులు


మరిపెడ రామాలయంలో విరిగిపడిన జువ్విచెట్టు


చీటకోడూరులో నేలవాలిన వరిపంట

రైతులపై ప్రకృతి కన్నెర్ర చేసింది. శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. దీంతో జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ నష్టం జరిగింది. జనగామలో రాళ్లతో కూడిన వర్షం పడింది. భారీగా వీచిన ఈదురు గాలులకు మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. వరిపంట నేలవాలింది. మిర్చిపంటలు దెబ్బతినడంతో రైతులు చాలా నష్టపోయారు. ప్రధాన రహదారుల్లో, వీధుల్లో ఉన్న చెట్లు నేలకూలాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో గ్రామాల్లో అంధకారం నెలకొంది. ప్రధాన రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అధికారులు ధ్వంసమైన పంటలను పరిశీలించి నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

-సాక్షి నెట్‌వర్క్


జనగామ వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యంను ఎత్తుతున్న మహిళలు



సెమీస్‌లో ఓడిన సాకేత్-యూకీ జోడీ

జీఎండబ్ల్యూ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) పోరాటం ముగిసింది. జర్మనీలోని మ్యూనిక్‌లో శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాకేత్-యూకీ జంటకు ఓటమి ఎదురైంది. 84 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సాకేత్-యూకీ 6-7 (4/7), 3-6తో అలెగ్జాండర్ ఎర్లెర్-లుకాస్ మీడ్లెర్ (ఆస్ట్రియా) చేతిలో ఓడిపోయారు. మ్యాచ్ మొత్తంలో ఐదు ఏస్‌లు సంధించిన సాకేత్, యూకీ ఐదు డబుల్ ఫాల్ట్‌లు కూడా చేయడం గమనార్హం. భారత జోడీ ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసి తమ సర్వీస్‌ను రెండు సార్లు కోల్పోయింది. సెమీస్‌లో ఓడిన సాకేత్-యూకీలకు 9,330 యూరోల (రూ. 8 లక్షల 47 వేలు)ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

సురేఖ 'డబుల్' ధమాకా



ప్రపంచకప్ ఆర్చరీ టోర్నీలో రెండు స్వర్ణ పతకాలు నెగ్గిన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి

స్వర్ణాలు సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది. నా అనుభూతిని మాటల్లో వర్ణించలేను. నేనీ స్థాయికి చేరుకోవడానికి ఎంతో మంది కృషి ఉంది. వారందరికీ ధన్యవాదాలు. ఈ సీజన్‌లో మరో మూడు ప్రపంచకప్‌లు, ప్రపంచకప్ ఫైనల్స్, ప్రపంచ చాంపియన్‌షిప్, ఆసియా క్రీడలు ఉన్నాయి. ఈ మెగా ఈవెంట్స్‌లోనూ పతకాలు సాధించడమే నా లక్ష్యం. - సురేఖ

2 ప్రపంచకప్ టోర్నీ వ్యక్తిగత విభాగంలో సురేఖ సాధించిన పతకాలు. 2022లో సురేఖ రజతం నెగ్గగా, ఈసారి స్వర్ణం సాధించింది.

11 ప్రపంచకప్ టోర్నీలలో ఓవరాల్‌గా సురేఖ నెగ్గిన పతకాలు. ఇందులో మూడు స్వర్ణాలు, మూడు రజతాలు, నాలుగు కాంస్యాలు ఉన్నాయి.

2 ప్రపంచకప్ టోర్నీల్లో మిక్స్‌డ్ టీమ్‌లో సురేఖ నెగ్గిన స్వర్ణాలు. 2022లో అభిషేక్ వర్మతో కలిసి తొలిసారి స్వర్ణం గెలిచింది.



అంటాల్యా (తుర్కియే): ఆద్యంతం నిలకడగా రాణించిన భారత స్టార్ ఆర్చర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ తన కెరీర్‌లో గొప్ప ప్రదర్శన చేసింది. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ... ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న ప్రపంచకప్ టోర్నీ వ్యక్తిగత స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. శనివారం జరిగిన ఈవెంట్స్‌లో విజయవాడకు చెందిన 26 ఏళ్ల జ్యోతి సురేఖ గురి తప్పని లక్ష్యంతో మెరిపించి ఏకంగా రెండు స్వర్ణ పతకాలను దక్కించుకొని డబుల్ ధమాకా సృష్టించింది. ముందుగా కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో తొలిసారి ప్రపంచకప్ టోర్నీలో ఆడుతున్న ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలె (మహారాష్ట్ర)తో కలిసి పసిడి పతకాన్ని సాధించింది. చెన్ యి సువాన్-చెన్ చి లున్ (చైనీస్ తైపీ) జోడీతో జరిగిన ఫైనల్లో జ్యోతి సురేఖ-ఓజస్ ప్రవీణ్ 159-154 పాయింట్ల తేడాతో గెలిచింది. తొలి మూడు రౌండ్‌లలో 40కి 40 పాయింట్లు స్కోరు చేసిన భారత జోడీ చివరి రౌండ్‌లో 39 పాయింట్లు సాధించింది. ఒక పాయింట్ తేడాతో ప్రపంచ రికార్డును సమం చేసే అవకాశాన్ని చేజార్చుకుంది. 2018లో అంటాల్యాలోనే జరిగిన ప్రపంచకప్‌లో దక్షిణ కొరియా జట్టు 160కి 160 పాయింట్లు స్కోరు చేసింది.

వరల్డ్ నంబర్‌వన్‌ను ఓడించి...

మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో జ్యోతి సురేఖ ప్రపంచకప్ టోర్నీల చరిత్రలో తొలిసారి పసిడి పతకాన్ని ముద్దాడింది. శనివారం జరిగిన ఫైనల్లో ప్రపంచ 11వ ర్యాంకర్ సురేఖ 149-146తో (30-30, 30-29, 29-29, 30-29, 30-29) ప్రపంచ మూడో ర్యాంకర్ సారా లోపెజ్ (కొలంబియా)పై గెలిచి 20వ ప్రయత్నంలో చాంపియన్‌గా అవతరించింది. 2011 నుంచి అంతర్జాతీయ టోర్నీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సురేఖ సెమీఫైనల్లో 148-146తో (29-29, 30-30, 30-30, 29-29, 30-28) ప్రపంచ నంబర్‌వన్ ఇలా గిబ్సన్ (బ్రిటన్)పై సంచలన విజయం సాధించింది.

లక్నో చేజేతులా...

గెలిచే దారిలో ఓటమిని పిలవడం అంటే ఇదే! 19 ఓవర్లలో లక్నో స్కోరు 124/3. ఇంకా 7 వికెట్లున్న జట్టు 6 బంతుల్లో 12 పరుగులు చేస్తే చాలు. పైగా తొలి ఓవర్ నుంచి ఆడుతున్న ఓపెనర్ కేఎల్ రాహుల్ అర్ధసెంచరీ చేసి క్రీజులో ఉన్నాడు. ఆఖరి ఓవర్ మొదటి బంతికి 2 పరుగులు కూడా చేశాడు. 5 బంతుల్లో 10 పరుగులు సులభంగానే కనిపించింది. కానీ మోహిత్ శర్మ వేసిన తర్వాతి 2 బంతులు రాహుల్, స్టొయినిస్‌లను బోల్తా కొట్టించాయి. ఇంకో 2 బంతులకు ఆయుశ్ బదోని, దీపక్ హుడా రనౌట య్యారు. అంతే ఆఖరి బంతి మిగిలుంది కానీ... టైటాన్స్ గెలిచింది! సమీకరణం 1 బంతికి 8 పరుగులు కాగా... మోహిత్ కనీసం ఒక పరుగైనా ఇవ్వలేదు. దీంతో ఎవరూహించని విజయం గుజరాత్ గూటికి చేరింది.

- నెగ్గాల్సిన మ్యాచ్‌లో 7 పరుగులతో ఓటమి
- ఆఖరి ఓవర్లో గుజరాత్‌ను గెలిపించిన మోహిత్
- రాహుల్ శ్రమ వృథా
- రాణించిన పాండ్యా, సాహా



ఆయుశ్ బదోనిని రనౌట్ చేస్తున్న మోహిత్ శర్మ

లక్నో: మోహిత్ శర్మ స్వింగ్ (2/17)తో గుజరాత్ టైటాన్స్ కింగ్ అయ్యింది. అనూహ్యంగా ఓటమి కోరల్లోంచి గెలుపు మజిలీకి చేరింది. అలవోకగా గెలవాల్సిన చోట లక్నో సూపర్ జెయింట్స్ వరుస నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు చేజార్చుకొని ఓటమిని పలకరించింది. మొదట గుజరాత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. కెప్టెన్ హార్దిక్ పాండ్యా (50 బంతుల్లో 66; 2 ఫోర్లు, 4 సిక్సర్లు), వృద్ధిమాన్ సాహా (37 బంతుల్లో 47; 6 ఫోర్లు) రాణించారు. లక్నో బౌలర్లలో కృనాల్ పాండ్యా, స్టొయినిస్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 128 పరుగులకే పరిమితమైంది. కెప్టెన్ కేఎల్ రాహుల్ (61 బంతుల్లో 68; 8 ఫోర్లు) పోరాటం జట్టును గెలిపించలేకపోయింది. మోహిత్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' లభించింది.

కెప్టెన్ ఇన్నింగ్స్...

సాహాతో శుబ్‌మన్ గిల్ (0) 'ఇంపాక్ట్' డకౌటైంది. వన్‌డౌన్‌లో కెప్టెన్ హార్దిక్ పాండ్యా అండతో సాహా బౌండరీలతో టైటాన్స్ స్కోరును కదిలించాడు. ఈ జోడీ పవర్‌ప్లేలో 40 పరుగులు చేసింది. ఆ తర్వాత అడపాదడపా ఫోర్లతో 10 ఓవర్ల దాకా వికెట్‌ను కాపాడుకున్నారు. జట్టు స్కోరు 72 వద్ద సాహాను కృనాల్ పాండ్యా అవుట్ చేయగా... తర్వాత వచ్చిన అభినవ్ (3), విజయ్ శంకర్ (10) నిరాశపరచడంతో పెద్ద స్కోరేం కాలేదు. ఆఖరి ఓవర్లలో హార్దిక్ భారీ సిక్సర్లతో స్కోరు పెంచే ప్రయత్నం చేశాడు. 44 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్న పాండ్యా ఆఖరి ఓవర్లో నిష్క్రమించాడు.



కేఎల్ రాహుల్

రాహుల్ ఒంటరి పోరాటం...

లక్నో ముందున్న లక్ష్యం 136 పరుగులు. కష్టమైందో... కఠినమైందో కానే కాదు! ఓపెనింగ్ జోడీ కెప్టెన్ రాహుల్, కైల్ మేయర్స్ (19 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1 సిక్స్) పవర్ ప్లేలోనే 53 పరుగులు చేయడంతో లక్ష్యఛేదన సులువుగా సాగింది. మేయర్స్ తర్వాత కృనాల్ పాండ్యా (23 బంతుల్లో 23; 2 ఫోర్లు, 1 సిక్స్) అవుటయ్యేసరికే జట్టు 100 పరుగులను దాటింది. నికోలస్ పూరన్ (1) విఫలమైనా... రాహుల్ క్రీజును అట్టిపెట్టుకోవడంతో ఎవరికీ ఏ బెంగా లేదు. రాహుల్ 38 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. ఆఖరి ఓవర్‌కు ముందు 124/3 స్కోరుతో లక్నో పటిష్ఠంగా ఉంది. కానీ ఆ తర్వాతే మోహిత్ చివరి ఓవర్ అనూహ్యంగా సూపర్ జెయింట్స్‌ను ఓడించింది. కచ్చితత్వం లేని షాట్లతో రాహుల్, స్టొయినిస్ (0)వికెట్లను పారేసుకుంటే... పరుగుల వేటలో ఆయుశ్ బదోని (8), దీపక్ హుడా (2) రనౌటయ్యారు.

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) హుడా (బి) కృనాల్ 47; గిల్ (సి) బిష్ణోయ్ (బి) కృనాల్ 0; హార్దిక్ పాండ్యా (సి) రాహుల్ (బి) స్టొయినిస్ 66; అభినవ్ (సి) నవీనుల్ హక్ (బి) మిశ్రా 3; విజయ్ శంకర్ (బి) నవీనుల్ హక్ 10; మిల్లర్ (సి) హుడా (బి) స్టొయినిస్ 6; తెవాటియా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 135. వికెట్ల పతనం:** 1-4, 2-72, 3-77, 4-92, 5-132, 6-135. **బౌలింగ్:** నవీనుల్ హక్ 4-0-19-1, కృనాల్ పాండ్యా 4-0-16-2, అవేశ్ ఖాన్ 3-0-21-0, రవి బిష్ణోయ్ 4-0-49-0, స్టొయినిస్ 3-0-20-2, అమిత్ మిశ్రా 2-0-9-1.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) జయంత్ (బి) మోహిత్ 68; మేయర్స్ (బి) రషీద్ ఖాన్ 24; కృనాల్ (స్టంప్డ్) సాహా (బి) నూర్ అహ్మద్ 23; పూరన్ (సి) హార్దిక్ (బి) నూర్ అహ్మద్ 1; బదోని (రనౌట్) 8; స్టొయినిస్ (సి) మిల్లర్ (బి) మోహిత్ 0; దీపక్ హుడా (రనౌట్) 2; ప్రేరక్ మన్కడ్ (నాటౌట్) 0; రవి బిష్ణోయ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 128. వికెట్ల పతనం:** 1-55, 2-106, 3-110, 4-126, 5-126, 6-127, 7-128. **బౌలింగ్:** షమీ 3-1-18-0, జయంత్ 4-0-26-0, రషీద్ ఖాన్ 4-0-33-1, మోహిత్ శర్మ 3-0-17-2, నూర్ అహ్మద్ 4-0-18-2, హార్దిక్ పాండ్యా 1-0-7-0, రాహుల్ తెవాటియా 1-0-8-0.

మెరుపుల్లో పంజాబ్‌దే గెలుపు



స్యామ్ కరన్

- అదరగొట్టిన స్యామ్ కరన్, హర్‌ప్రీత్
- కీలక వికెట్లు తీసిన అర్ష్‌దీప్
- 13 పరుగులతో ముంబైపై పంజాబ్ కింగ్స్ గెలుపు
- గ్రీన్, సూర్యకుమార్ శ్రమ వృథా

ముంబై: మెరుపుల ప్రతాపంలో పంజాబ్ కింగ్స్ పైచేయి సాధించింది. 13 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. తొలుత పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. కెప్టెన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్యామ్ కరన్ (29 బంతుల్లో 55; 5 ఫోర్లు, 4 సిక్సర్లు), హర్‌ప్రీత్ సింగ్ (28 బంతుల్లో 41; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించారు. జితేశ్ శర్మ (7 బంతుల్లో 25; 4 సిక్సర్లు) ఆఖర్లో శివమెత్తాడు. గ్రీన్, పియూష్ చావ్లా రెండేసి వికెట్లు తీశారు. తర్వాత భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 201 పరుగులకు పరిమితమైంది. గ్రీన్ (43 బంతుల్లో 67; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), సూర్యకుమార్ (26 బంతుల్లో 57; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), రోహిత్ శర్మ (27 బంతుల్లో 44; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), టిమ్ డేవిడ్ (13 బంతుల్లో 25 నాటౌట్; 2 సిక్స్‌లు) చెలరేగారు. కానీ ఆఖరి ఓవర్ ఫినిషింగ్‌లో అర్ష్‌దీప్ (4/29) నిప్పులు చెరగడంతో ముంబై విజయానికి దూరమైంది. ముంబై గెలుపునకు ఆఖరి ఓవర్లో 16 పరుగులు కావాల్సి ఉండగా... అర్ష్‌దీప్ 2 పరుగులే ఇచ్చి తిలక్ వర్మ (3), నేహల్ వధేరా (0) వికెట్లను విరిచేశాడు.



అర్ష్‌దీప్

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: షార్ట్ (సి) చావ్లా (బి) గ్రీన్ 11; ప్రభ్‌సిమ్రన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్జున్ 26; అథర్వ (బి) చావ్లా 29; లివింగ్‌స్టోన్ (స్టంప్డ్) కిషన్ (బి) చావ్లా 10; హర్‌ప్రీత్ (బి) గ్రీన్ 41; కరన్ (సి అండ్ బి) ఆర్చర్ 55; జితేశ్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 25; షారుక్ నాటౌట్ 0; హర్‌ప్రీత్ బ్రార్ రనౌట్ 5; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 214. వికెట్ల పతనం:** 1-18, 2-65, 3-82, 4-83, 5-175, 6-197, 7-209, 8-214. **బౌలింగ్:** అర్జున్ టెండూల్కర్ 3-0-48-1, బెహ్రెన్‌డార్ఫ్ 3-0-41-1, గ్రీన్ 4-0-41-2, ఆర్చర్ 4-0-42-1, పీయూష్ చావ్లా 3-0-15-2, హృతిక్ షోకీన్ 3-0-24-0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి అండ్ బి) లివింగ్‌స్టోన్ 44; ఇషాన్ కిషన్ (సి) షార్ట్ (బి) అర్ష్‌దీప్ సింగ్ 1; గ్రీన్ (సి) స్యామ్ కరన్ (బి) ఎలిస్ 67; సూర్యకుమార్ యాదవ్ (సి) అథర్వ (బి) అర్ష్‌దీప్ 57; టిమ్ డేవిడ్ (నాటౌట్) 25; తిలక్‌వర్మ (బి) అర్ష్‌దీప్ సింగ్ 3; నేహల్ వధేరా (బి) అర్ష్‌దీప్ సింగ్ 0; ఆర్చర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 201. వికెట్ల పతనం:** 1-8, 2-84, 3-159, 4-182, 5-200, 6-200. **బౌలింగ్:** షార్ట్ 1-0-7-0, అర్ష్‌దీప్ 4-0-29-4, హర్‌ప్రీత్ బ్రార్ 2-0-15-0, స్యామ్ కరన్ 3-0-41-0, ఎలిస్ 4-0-44-1, రాహుల్ చహర్ 4-0-42-0, లివింగ్‌స్టోన్ 2-0-23-1.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	6	4	2	8	1.043
లక్నో	7	4	3	8	0.547
చెన్నై	6	4	2	8	0.355
గుజరాత్	6	4	2	8	0.212
పంజాబ్	7	4	3	8	-0.162
బెంగళూరు	6	3	3	6	-0.068
ముంబై	6	3	3	6	-0.254
కోల్‌కతా	6	2	4	4	0.214
హైదరాబాద్	6	2	4	4	-0.794
ఢిల్లీ	6	1	5	2	-1.183

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు x రాజస్తాన్ (మ. గం. 3:30 నుంచి)
కోల్‌కతా x చెన్నై (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

'కొటక్-పుల్లెల గోపీచంద్ అకాడమీ' ప్రారంభం



గచ్చిబౌలి: బ్యాడ్మింటన్ క్రీడాకారులకు మరో శిక్షణ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. శనివారం గచ్చిబౌలిలో కొటక్ మహీంద్ర బ్యాంక్ లిమిటెడ్ సీఎస్‌ఆర్ అసోసియేట్, పుల్లెల గోపీచంద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'కొటక్-పుల్లెల గోపీచంద్ అకాడమీ'ని ప్రారంభించారు. ఈ అకాడమీని అత్యాధునిక మౌలిక వసతులు, అంతర్జాతీయ కోచ్‌లతో ప్రపంచస్థాయి బ్యాడ్మింటన్ శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దుతామని... ఔత్సాహిక, అత్యంత ప్రతిభావంతులైన క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ ఇస్తామని జాతీయ చీఫ్ కోచ్ గోపీచంద్ వ్యాఖ్యానించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్)లో భాగంగా కొటక్ మహీంద్ర బ్యాంక్ భారతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు ప్రపంచస్థాయి శిక్షణ సౌకర్యాన్ని అభివృద్ధి చేసేందుకు సహకారం అందిస్తుందన్నారు. యువత భవిష్యత్ కోసం క్రీడా మౌలిక వసతులు అందించేందుకు గోపీచంద్ అకాడమీతో కలిసి పనిచేస్తామని కొటక్ మహీంద్ర బ్యాంక్ హోల్ టైమ్ డైరెక్టర్ శాంతి ఏకాంబరం పేర్కొన్నారు. కొటక్-పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ శిక్షణ కేంద్రంలో అత్యుత్తమ నాణ్యత గల న్యూట్రిషియనిస్టులు, ఫిజియోథెరపిస్టులు, నిపుణులతో కూడిన స్పోర్ట్స్ సైన్స్ సెంటర్ ఉంటుంది. ఆర్థికంగా వెనుకబడిన కోచ్‌లు, క్రీడాకారుల కోసం ఫెలోషిప్ ప్రోగ్రామ్, బ్యాడ్మింటన్ శిక్షణ పరిధిని విస్తరించేందుకు పూర్వ క్రీడాకారుల కోసం కోచ్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కొటక్ మహీంద్ర గ్రూప్ ప్రెసిడెంట్, సీఎఫ్‌ఓ జైమిన్ భట్, ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం, భారత షట్లర్లు సైనా నెహ్వాల్, సిక్కి రెడ్డి, శ్రీకాంత్, సాయి ప్రణీత్, పుల్లెల గాయత్రి, ట్రిసా జాలీ, అశ్విని పొన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

చాంపియన్ అర్జున్



అస్తానా (కజకిస్తాన్): సాటీ జుల్దిజ్ ఓపెన్ అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ చాంపియన్‌గా అవతరించాడు. శనివారం ముగిసిన ఈ టోర్నీలో అర్జున్ నిర్ణీత 11 రౌండ్ల తర్వాత 9.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. శనివారం జరిగిన చివరి మూడు రౌండ్ గేముల్లో అర్జున్ రెండింటిలో గెలిచి, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకొని ఈ టోర్నీని అజేయంగా ముగించాడు. క్రామ్నిక్ (రష్యా)తో జరిగిన తొమ్మిదో రౌండ్‌లో అర్జున్ 47 ఎత్తుల్లో గెలుపొందగా... అరోనియన్ (అమెరికా)తో జరిగిన పదో రౌండ్‌ను అర్జున్ 24 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. కాటరీనా లాగ్నో (రష్యా)తో జరిగిన చివరిదైన 11వ రౌండ్ గేమ్‌లో అర్జున్ 58 ఎత్తుల్లో గెలిచాడు.

బోపన్న జోడీ ఓటమి

బార్సిలోనా: బార్సిలోనా ఓపెన్ టెన్నిస్ టోర్నీ డబుల్స్ సెమీఫైనల్లో రోహన్ బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 4-6, 5-7తో వెస్లీ కూలాఫ్ (నెదర్లాండ్స్)-నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్) జోడీ చేతిలో ఓడింది. బోపన్న జోడీకి 45,120 డాలర్ల (రూ. 37 లక్షలు) ప్రైజ్‌మనీ దక్కింది.

సినిమా

ఆ ఒక్క సెంటిమెంట్ ఫాలో అవుతున్నా! - అఖిల్

"30 ఏళ్లకు పైగా మా నాన్నగారు (నాగార్జున) ఇండస్ట్రీలో ఉన్నారు కాబట్టి ప్రతి డిపార్ట్‌మెంట్‌లో ఆయనకు మంచి గ్రిప్ ఉంది. నాకేమైనా సందేహాలు ఉంటే ఆయన్ని అడిగి తెలుసుకుంటాను. అయితే ఫలానా స్క్రిప్ట్ ఓకే చేయాలా? వద్దా అని అడగను. అలా చేస్తే నా కెరీర్ తాలూకు ఒత్తిడిని నాన్నపై పెట్టినట్లు ఉంటుంది. ఆయన ప్రమేయం ఎక్కువగా ఉంటే ఓ వ్యక్తిగా నేను ఎదగలేక పోవచ్చు. అందుకే సొంత నిర్ణయాలు తీసుకుంటున్నాను. ఈ కారణంగానే 'ఏజెంట్' స్క్రిప్ట్‌ను నాన్నతో షేర్ చేయలేదు" అన్నారు అఖిల్. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో అఖిల్ హీరోగా నటించిన చిత్రం 'ఏజెంట్'. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా అఖిల్ చెప్పిన విశేషాలు.

● నాకు యాక్షన్ సినిమాలంటే చాలా ఇష్టం. నా గత చిత్రం 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' టైమ్‌లో సూరిగారు (సురేందర్ రెడ్డి) 'ఏజెంట్' కథ చెప్పారు. నాకూ నచ్చింది. దాంతో వెంటనే అనౌన్స్ చేశాం. అయితే స్క్రిప్ట్ పూర్తి కావడానికి, నా లుక్ మార్చుకోవడం, లాక్‌డౌన్ వంటి వాటి వల్ల ఈ సినిమా ఆలస్యమైంది. ● 'ఏజెంట్'లో నేను రామకృష్ణ (రిక్కీ) అనే పాత్ర చేశాను. రిక్కీ పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. 'ఏజెంట్' ఒక మంచి స్పై డ్రామా. సురేందర్ రెడ్డిగారు ప్రతిదీ ఫైన్ ట్యూన్ చేస్తారు. నేను ఆయన్ను బ్లైండ్‌గా ఫాలో అయ్యాను. ఇక సెకండాఫ్‌లో వచ్చే టార్చర్ సీన్ కోసం చాలా కష్టపడ్డాను. ● సాధారణంగా నేను సెంటిమెంట్స్‌ను నమ్మను. అయితే ఏప్రిల్ 28న 'అడవి రాముడు', 'పోకిరి', 'బాహుబలి' వంటి ఎన్నో సక్సెస్‌ఫుల్ సినిమాలు విడుదలయ్యాయి. ఇలాంటి హిట్ సినిమాలు విడుదలైన ఏప్రిల్ 28న 'ఏజెంట్' సినిమా విడుదల అవుతోంది. ఈ సెంటిమెంట్‌ను మాత్రం ఫాలో అవుతున్నాను. ● నాన్నగారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం అనేది నా కల. అది నాన్నగారి వందో సినిమా అయితే నాకు ఇంకా సంతోషం. ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది. కానీ నాకు తెలిసి అలాంటి స్క్రిప్ట్ ఏదీ ఫైనలైజ్ కాలేదు. 'ఏజెంట్' సినిమా ట్రైలర్ చూసి, నేను చాలా కష్టపడ్డానని తెలిసి మా అమ్మగారు (అక్కినేని అమల) ఎమోషన్ అయ్యారు.




జై శ్రీరామ్.. జై శ్రీరామ్

'నీ సాయం సదా మేమున్నాం.. సిద్ధం సర్వ సైన్యం.. సహచరులై పదా వస్తున్నాం. సఫలం స్వామి కార్యం' అంటూ 'జై శ్రీరామ్' నామం ప్రతిధ్వనించేలా 'ఆదిపురుష్' చిత్రం నుంచి ఓ లిరికల్ వీడియోను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ప్రభాస్ టైటిల్ రోల్‌లో ఓం రౌత్ దర్శకత్వం వహించిన చిత్రం 'ఆదిపురుష్'. శనివారం ఈ చిత్రం నుంచి 60 సెకన్ల 'జై శ్రీరామ్' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. అజయ్-అతుల్ స్వరపరిచిన ఈ గీతాన్ని హిందీ, తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల చేశారు. తెలుగులో రామజోగయ్య శాస్త్రి రాశారు. భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్, ఓం రౌత్, ప్రసాద్ సుతార్, రాజేష్ నాయర్, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 16న రిలీజ్ కానుంది.



● ప్రభాస్

ఐ హేట్ లవ్



● సుధీర్‌బాబు

"దేవుడడిగాడంట.. నన్ను చేరడానికి ఏడు జన్మలు నాకు భక్తుల్లా బతుకుతారా...లేక మూడు జన్మలు రాక్షసుల్లా బతుకుతారా అని. ఏడు జన్మలు నీకు దూరంగా ఉండే కన్నా... మూడు జన్మల రాక్షస బతుకే మిన్న అని దేవతలే కోరుకున్నారట', 'ఐ హేట్ లవ్' అనే డైలాగ్స్‌తో విడుదలైంది 'మామా మశ్చీంద్ర' టీజర్. సుధీర్ బాబు హీరోగా హర్షవర్ధన్ నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ఇది. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన ఈ చిత్రంలో మృణాళినీ రవి, ఈషా రెబ్బా హీరోయిన్లు. సోనాలీ నారంగ్, సృష్టి సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. శనివారం ఈ సినిమా టీజర్‌ను హీరో మహేశ్‌బాబు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ చిత్రంలో దుర్గ, డీజే, పరశురామ్ పాత్రలు చేశారు సుధీర్‌బాబు.

చైత్రతో ప్రేమ



● ఇవానా, ఆశిష్

'రౌడీ బాయ్స్'తో ఆకట్టుకున్న ఆశిష్ రెడ్డి హీరోగా నటిస్తున్న రెండో చిత్రం 'సెల్ఫిష్'. కాశీ విశాల్ దర్శకత్వంలో సుకుమార్ రైటింగ్స్, 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఇవానా కథానాయిక. ఆమె పాత్ర పేరు చైత్ర. ఆందోళనగా ఉన్న చైత్రను హీరో తదేకంగా చూస్తున్న పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. హైదరాబాద్‌లోని పాతబస్తీలో జరిగే ఈ మాస్ లవ్‌స్టోరీలో ఆశిష్ ఓల్డ్ సిటీ కుర్రాడి పాత్ర చేస్తుండగా, ఇవానా ఫైనాన్షియల్ ఎనలిస్ట్ పాత్ర చేస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె మేయర్, కెమెరా: ఎస్. మణికందన్, సహనిర్మాతలు: హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి, అశోక్ బండ్రెడ్డి.